క్లుప్తంగా

మోదీ హయాంలో సంక్షేమం

నెల్లూరు(మినీబైపాస్): ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో ప్రజలకు ఎంతో మేలు చేశారని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఉమా మహేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొట్లూరి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఏలూరు బుజ్జయ్య, కోశాధికారి మానికల సంజీవమ్మ పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీలో తనిఖీలు

నెల్లూరు (అర్బన్): జేవీఆర్ కాలనీలోని యూపీహెచ్‌సీని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్ తనిఖీ చేశారు. రికార్డులు, ఫార్మసీలో ఉన్న మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు నాణ్యమైన వైద్యసేవలను అందించాలని సూచించారు. సమయపాలన పాటించాలని చెప్పారు. ముఖ హాజరును నమోదు చేయాలని, తేడా వస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

కార్మికుల సమ్మెకు మద్దతు

నెల్లూరు (వేదాయపాళెం): కృష్ణపట్నం పోర్టులో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మెరుపు సమ్మెకు దిగిన కార్మికులకు మద్దతిస్తున్నామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కటారి అజయ్‌కుమార్ పేర్కొన్నారు. జేమ్స్‌గార్డెన్‌లోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులపై యాజమాన్యం వివక్ష చూపుతోందని ఆరోపించారు. కృష్ణపట్నం పోర్టు క్లియరింగ్, ఫార్వర్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, కోశాధికారి పెంచలనర్సయ్య, నగర కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ

నెల్లూరు (అర్బన్): నవాబుపేట సమీపంలోని పేద వృద్ధులకు బియ్యం, నిత్యావసర సరుకులను అమ్మా యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి సహకరించిన వెంకటరెడ్డి కుటుంబసభ్యులకు ఫౌండేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు కృతజ్ఞతలను తెలియజేశారు. నేతలు శశికిరణ్, కార్తికేయ, శరత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు సత్కారం

నెల్లూరు(సెంట్రల్): నగరంలోని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మాన కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి సుధాకర్‌రాజు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. జిల్లా గణాంకాధికారి శ్రీనివాసులు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఏడీ అనితను సత్కరించారు. కాగా గణాంకాధికారి సుబ్బయ్య, సూపరింటెండెంట్ పుష్పకుమారి, ఏడీ శేషగిరిరావు నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఏడీ నర్సోజీ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

నెల్లూరు(బారకాసు): బుజబుజనెల్లూరులో పారిశుధ్య పనులను మేయర్ స్రవంతి శుక్రవారం పరిశీలించారు. 25వ డివిజన్ పరిధిలోని గిరిజన కాలనీ, తదితర ప్రాంతాల్లో వీధులను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. ఇంటి వద్దకు వచ్చిన వాహనాలకే చెత్తను అందజేయాలని కోరారు. బహిరంగ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్పొరేటర్ బద్దెపూడి నరసింహగిరి పాల్గొన్నారు.

12న మాతృశ్రీ భవన ప్రారంభం

నెల్లూరు(మినీబైపాస్): మనుమసిద్ధినగర్‌లోని జిల్లా బ్రాహ్మణ భవన సముదాయంలో మాతృశ్రీ భవనాన్ని సోమవారం ప్రారంభించనున్నామని సంస్థ అధ్యక్షులు పద్మావతి పేర్కొన్నారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో శుక్రవారం ఆమె మాట్లాడారు. సత్యనారాయణ వ్రతం, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, తదితరాలను మంగళవారం నిర్వహించనున్నామని చెప్పారు. ఉపాధ్యక్షులు జయలక్ష్మి, కార్యదర్శి జీ జయలక్ష్మి పాల్గొన్నారు.

ఈ - కేవైసీని తక్షణమే చేయించుకోవాలి

నెల్లూరు (అర్బన్): ఈ - కేవైసీని నమోదు చేసుకోని పింఛనర్లు తక్షణమే చేయించుకోవాలని ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. నెల్లూరు సబ్ ట్రెజరీ శని, ఆదివారాల్లోనూ పనిచేయనుందని, ఈ క్రమంలో విశ్రాంత ఉద్యోగులు ఈ - కేవైసీని తప్పక చేయించుకోవాలని సూచించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. బుజబుజనెల్లూరులోని రామాలయ వీధిలో సుమారు 45 నుంచి 50 ఏళ్లలోపు వయస్సు గల వ్యక్తి రోడ్డుపై నడుచుకొని వెళ్తూ ఉన్నట్లుండి పడిపోయి అపస్మారక స్థితిలోకి శుక్రవారం వెళ్లారు. గమనించిన స్థానికులు 108లో జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే ఆయన మృతి చెందారు. ఈ మేరకు వేదాయపాళెం పోలీసులకు వీఆర్వో విష్ణువర్ధన్ ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

గ్రామాల అభివృద్ధికి చర్యలు చేపట్టండి



మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): సంసద్ ఆదర్శ గ్రామ యోజన ద్వారా జిల్లాలో ఎంపిక చేసిన ఆరు గ్రామాల సమగ్రాభివృద్ధికి అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. సంసద్ ఆదర్శ గ్రామ యోజన మొదటి సమావేశాన్ని కలెక్టరేట్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయా గ్రామాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై మండల, గ్రామస్థాయి అధికారులు, సిబ్బంది, గ్రామస్తులకు ముందుగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు గ్రామాల్లో అమలయ్యేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడు, కోవూరు, విడవలూరు మండలంలోని రామతీర్థం, బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రేబాల, అల్లూరు మండలంలోని పురిణి, కలిగిరి గ్రామాలను పార్లమెంట్ సభ్యులు ఎంపిక చేశారని జెడ్పీ సీఈఓ చిరంజీవి వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు, డీపీఓ సుస్మితారెడ్డి, డ్వామా పీడీ వెంకట్రావు, పంచాయతీరాజ్ ఎస్‌ఈ అశోక్, డీఈఓ గంగాభవానీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ రంగప్రసాద్, సోషల్ వెల్ఫేర్ డీడీ రమేష్, ఐసీడీఎస్ పీడీ సౌజన్య, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పరిమళ పాల్గొన్నారు.

స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నెల్లూరు(బారకాసు): నగరంలో పారిశుధ్య మెరుగునకు ప్రజలు సహకరించాలని, ఖాళీ ప్లాట్ల యజమానులు తమ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. 18వ డివిజన్లోని హరనాథపురంలో చెత్త సేకరణ పనులను శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఖాళీ ప్లాట్లను పరిశుభ్రంగా ఉంచుకునేలా యజమానులను గుర్తించి నోటీసులను జారీ చేయాలని ఆదేశించారు.

- జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు అదనపు కార్మికులను నియమించాలని హౌసింగ్ విభాగాధికారులను కమిషనర్ ఆదేశించారు. హరనాథపురం, ముత్తుకూరు రోడ్డు కూడలిలో భవన నిర్మాణ కార్మికులతో ఆయన మాట్లాడారు. జగనన్న కాలనీల్లో నిర్మాణాలకు దినసరి వేతన కార్మికులుగా పని చేసేందుకు వారు సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు.
- నగరంలోని 44 / 1, 44 / 2, లీలామహల్‌రోడ్డు, చాకలివీధి వార్డు సచివాలయాలను కమిషనర్ తనిఖీ చేశారు. సచివాలయాల్లోని నోటీస్ బోర్డు, హాజరు, స్పందన రిజిస్టర్లతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు.
- 24వ డివిజన్ కల్లూరుపల్లి, ఇందిరమ్మ కాలనీ, జక్కా వెంకయ్యనగర్, తదితర ప్రాంతాల్లో స్పందన ఫిర్యాదులను అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. డివిజన్ పరిధిలో హైటెన్షన్ వైర్లను వేరే ప్రాంతాలకు మార్చాలనే ఫిర్యాదుపై విచారణ జరిపారు. అనంతరం వివిధ ప్రాంతాలకు సంబంధించిన స్పందన ఫిర్యాదులను పరిశీలించారు.
- మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఏసీ కూరగాయల మార్కెట్ వద్ద ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టనున్నామని కమిషనర్ తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ట్రాఫిక్, తూనికలు... కొలతలు, మున్సిపల్, వ్యవసాయ మార్కెటింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూరగాయలు, పండ్ల విక్రయదారులను బయట ఉదయం 8.30 వరకే అనుమతించాలని, ఆ తర్వాత పాత కోనేరులోని మార్కెట్లో వ్యాపారాలు జరుపుకొనేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రహదారులకు అడ్డంగా ఉంటున్న గోవులను కల్లూరుపల్లిలోని గోశాలకు తరలించాలని పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ రోడ్డులో ఉన్న సులభ్ కాంప్లెక్స్‌ను తొలగించి అక్కడ ద్విచక్రవాహనాలకు పార్కింగ్ వసతి కల్పించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరి, గోశాల నిర్వాహకురాలు ఇందిరాజైన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రైతుబజార్ సబ్‌స్టేషన్ పరిధిలోని బోడిగాడితోట, వీవర్స్‌కాలనీ ఫీడర్లలో మరమ్మతులు, హరనాథపురం సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ – 2 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసూదన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శెట్టిగుంట రోడ్డు, లక్ష్మీపురం, వీవర్స్‌కాలనీ, శ్రీనివాసనగర్, బోడిగాడితోట, హరనాథపురం, ఆదిత్యనగర్, అపోలో ఆస్పత్రి, ఆకుతోట, పార్థసారథినగర్, సర్వేపల్లి కాలువకట్ట, తదితర ప్రాంతాల్లో ఉదయం 7.30 నుంచి 10.30 వరకు సరఫరా ఉండదని చెప్పారు.

- రామ్మూర్తినగర్ సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా రామ్మూర్తినగర్, మినీబైపాస్‌రోడ్డు, జేమ్స్ గార్డెన్స్, శ్రీనివాసాగ్రహారం, బాలాజీనగర్, పుట్టవీధి, మసీదు సెంటర్, ఆదిత్యనగర్, గుర్రాలమడుగు సంఘం, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని వెస్ట్ – 2 సెక్షన్ ఏఈ ప్రసాద్‌రావు పేర్కొన్నారు.
- ఎంజీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ టవర్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో లక్ష్మీనరసింహపురం, రామాలయ వీధి, బారాషహీద్ దర్గా, ఆదర్శ్‌నగర్, లేక్ వ్యూకాలనీ, సుజాతమ్మకాలనీ, బ్రహ్మానందపురం, రాజగోపాలపురం, బెజవాడ ఓబుల్‌రెడ్డినగర్, బషీర్‌నగర్, అంబేడ్కర్‌నగర్, ప్రశాంతినగర్, సరస్వతీనగర్, ఎల్‌ఐసీ కార్యాలయం, నెల్లూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయం, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సరఫరా ఉండదని ఐతా సెక్షన్ ఏఈ లక్ష్మీనారాయణ తెలిపారు.
- నగరంలోని ఇరుగాళమ్మ, డైకస్‌రోడ్డు, సరస్వతీనగర్ సబ్‌స్టేషన్ల పరిధిలో 33 కేవీ విద్యుత్ టవర్లను చార్జింగ్ చేయనున్న తరుణంలో మూలాపేట, రాజావారివీధి, అలంకార్ సెంటర్, ఫతేఖాన్‌పేట, రమేష్‌రెడ్డినగర్, రైతుబజార్, టెక్కేమిట్ట, శాంతినగర్, సరస్వతీనగర్, క్రాంతినగర్, రామ్‌నగర్, పాత మిలటరీకాలనీ, అరవింద్‌నగర్, ఆర్టీసీ బస్టాండ్, శోధన్‌నగర్, తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని నెల్లూరు వెస్ట్ – 1 ఏఈ లక్ష్మీబాయి పేర్కొన్నారు.
- రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ లైన్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో గుప్తా పార్క్, సంతపేట, ఈద్గామిట్ట, రామిరెడ్డి వీధి, పొర్లుకట్ట, తూకుమానుమిట్ట, బ్రాహ్మణవీధి, కోటమిట్ట, ములుమూడి బస్టాండ్, చిన్నబజార్, అగ్నిపేట, కుక్కలగుంట, గిడ్డంగివారివీధి, పాత మున్సిపల్, డీఎంహెచ్‌ఓ కార్యాలయం, పంరమేశ్వరినగర్, మనుమసిద్ధినగర్, శివగిరికాలనీ, పుత్తా ఎస్టేట్స్, రంగనాయకులపేట, రైల్వేఫీడర్స్ రోడ్డు, ఇసుకడొంక, సంతపేట, తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని వెస్ట్ – 2 ఏఈ గోపీ తెలిపారు.
- బీవీనగర్, పడారుపల్లి సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా మాగుంట లేఅవుట్, లెక్చరర్స్ కాలనీ, రవీంద్రనగర్, బీవీనగర్, సప్తగిరి కాలనీ, ఆర్టీఏ కార్యాలయం, పడారుపల్లి, సుందరయ్యకాలనీ, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని బీవీనగర్ ఏఈ చిన్నయ్య పేర్కొన్నారు.

కల్లూరుపల్లిలో ఉద్రిక్తత



నెల్లూరు రూరల్: కల్లూరుపల్లి ఇందిరమ్మ కాలనీ సమీపంలోని కొత్త చెరువు వద్ద శుక్రవారం ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ, జనసేన, సీపీఎం నేతలు, ఇతర ప్రాంతాల వారు ఇక్కడికి చేరుకొని చెరువులో ఎలాంటి తవ్వకాలు జరిపినా సహించబోమంటూ ఆందోళనకు దిగారు. కాగా నాలుగు వేల క్యూబిక్ మీటర్ల మేర తవ్వకాలు జరిపేందుకు ఇరిగేషన్ శాఖ నుంచి అనుమతులున్నాయంటూ అనుమతి పత్రాలను విలేకరులకు చూపారు. రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, పోలీస్ బలగాలతో చెరువు వద్దకు చేరుకొని ఆందోళనకారులను చెదరగొట్టారు. చెరువులో తవ్వకాలకు అనుమతులున్నాయని, వీటిని అడ్డుకోవడం చట్ట వ్యతిరేకమని హెచ్చరించారు. అనంతరం తవ్వకాలను యథావిధిగా కొనసాగించారు. సర్వే నంబర్ 8లోని కొత్త చెరువులో తవ్వకాలకు అనుమతులున్నాయని, అయితే కొందరు ఆటంకాలు సృష్టిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు సునీల్, రవీంద్రరెడ్డి ఆరోపించారు. మురళి, భారతి, మైథిలీ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల అందజేత

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 16వ డివిజన్ పరిధిలో గల గుర్రాలమడుగు సంఘంలో పలువురికి ఇళ్ల పట్టాలను కార్పొరేటర్ శ్రీకాంత్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కృష్ణపట్నం కాలువ గోడ నిర్మాణం జరుగుతున్న ఈ ప్రాంతంలో 24 ఇళ్లు కూలిపోయాయని తెలిపారు. సమస్యను నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి పట్టాలను అందజేశామని వివరించారు.

దరఖాస్తులను నేటిలోపు అందజేయాలి

నెల్లూరు(టౌన్): బదిలీలకు సంబంధించి ప్రభుత్వ, జెడ్పీ పాఠశాలల్లో ఒకేషనల్ (ఆల్ ట్రేడ్స్) డ్రాయింగ్, క్రాఫ్ట్స్, మ్యూజిక్ విభాగాల్లో పనిచేస్తున్న టీచర్లు డీఈఓ కార్యాలయానికి శనివారం హాజరై దరఖాస్తులను అందజేయాలని డీఈఓ గంగాభవానీ శుక్రవారం తెలిపారు. వీరికి మాన్యువల్ కౌన్సెలింగ్‌ను ఆదివారం నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

రుణ మేళాను సద్వినియోగం చేసుకోండి



ప్రగతి చారిటీస్‌కు పరికరాల వితరణ

నెల్లూరు(సెంట్రల్): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎమ్మెస్సెమ్‌ఈ రిటైల్ రుణమేళాను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ జనరల్ మేనేజర్ జ్ఞాన రంజన్, రీజినల్ మేనేజర్ కిల్లి జోగారావు పేర్కొన్నారు. ప్రాజెక్ట్ పవర్ పథకంలో భాగంగా రుణమేళాను నిర్వహించి పలువురికి చెక్కులను నగరంలోని ఉమేష్ చంద్ర సమావేశ మందిరంలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించడంతో పాటు అర్హులకు రుణాలను మంజూరు చేయనున్నామని చెప్పారు. అనంతరం బ్యాంక్ సీఎస్సార్ పథకంలో భాగంగా ప్రగతి చారిటీస్‌లో పలు కార్యక్రమాలను నిర్వహించారు.

తల్పగిరి కాలనీలో చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు తలుపులను పగలగొట్టి చోరీకి పాల్పడిన ఘటన తల్పగిరి కాలనీలో చోటుచేసుకుంది. వివరాలు.. తల్పగిరికాలనీకి చెందిన జ్యోతి కోవూరులోని జూనియర్ కళాశాలలో అధ్యాపకురాలిగా.. ఆమె భర్త హైదరాబాద్‌లో పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇంటి నుంచి కళాశాలకు గురువారం ఆమె వెళ్లారు. అనంతరం బదిలీ విషయమై అక్కడి నుంచి ఒంగోలు వెళ్లారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు ఇంటి తలుపులను పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బెడ్ రూమ్‌లోని రెండు బీరువాలను పగలగొట్టి లాకర్‌లోని తొమ్మిది సవర్ల బంగారు ఆభరణాలు, హాల్లోని టీవీని అపహరించుకెళ్లారు. పనిమనిషి హైమావతి ఉదయం ఇంటికొచ్చిచూడగా తలుపులు పగలగొట్టి ఉండటంతో విషయాన్ని బుజబుజనెల్లూరులోని జ్యోతి మరిది ఏడుకొండలుకు తెలియజేశారు. విషయాన్ని బాధితురాలికి ఫోన్లో తెలియజేయగా, ఆమె హుటాహుటిన నెల్లూరు చేరుకొని ఘటనపై వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'ఫ్యామిలీ డాక్టర్'పై ప్రత్యేక దృష్టి

నెల్లూరు(అర్బన్): ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌పై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు మరింత చేరువ చేసేందుకు వైద్యశాఖ అధికారులు కృషి చేయాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కమిషనర్ నివాస్ సూచించారు. సచివాలయం నుంచి నెల్లూరు జిల్లా వైద్యశాఖాధికారులతో జూమ్ కాన్ఫరెన్స్‌ను శుక్రవారం నిర్వహించారు. గ్రామాల్లో ఓపీ సేవలు పెంచాలని ఆదేశించారు. జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్, ఫ్యామిలీ డాక్టర్ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్సీ



నెల్లూరు (టౌన్): తాడేపల్లిలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ, తదితర నిర్ణయాలు తీసుకోవడంపై సీఎంకు కృతజ్ఞతలను తెలియజేశారు.

అప్రమత్తత అవసరం



ముత్తుకూరు : విధి నిర్వహణలో విద్యుత్ శక్తిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శైలేంద్రకుమార్ పేర్కొన్నారు. నేలటూరులోని దామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్‌లో కార్మికులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భద్రత ప్రమాణాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.

విద్యా వ్యాపారాన్ని అరికట్టరూ..

నెల్లూరు (టౌన్): ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్యసాయి కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ గంగాభవానీకి వినతిపత్రాన్ని శుక్రవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్పొరేట్ విద్యాసంస్థలపై జిల్లా విద్యా శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. నేతలు మనోజ్, పార్థసారథి, సందీప్, సునీల్ పాల్గొన్నారు.

సభ జయప్రదానికి పిలుపు

నెల్లూరు(మినీబైపాస్): మాదిగల జన జాగృతి సభను జయప్రదం చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా కన్వీనర్ బెల్లంకొండ గోపీ పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. సభను జూలై ఏడున నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

వాణిజ్య విభాగాల బలోపేతం

నెల్లూరు(బృందావనం): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాణిజ్య విభాగ కమిటీల నియామకం, బలోపేతానికి గానూ ఎంపీ, పార్టీ అనుబంధ విభాగాల ఇన్‌చార్జి వేణుంబాక విజయసాయిరెడ్డి పలు సూచనలు చేశారని రీజినల్ జోనల్ ఇన్‌చార్జి చందోలు సతీష్‌కుమార్ పేర్కొన్నారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగ అధ్యక్షులు, విభాగ జోనల్ ఇన్‌చార్జిలు, తదితరులతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. నెల్లూరుకు చెందిన నేతలు రవికుమార్, కనమర్లపూడి నారాయణ, రత్నాజీ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి సహకరించరూ..

నెల్లూరు సిటీ: జిల్లాలో ఆర్టీసీ అభివృద్ధికి సహకరించాలని ఎన్‌ఎంయూ జిల్లా కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి, జోనల్ చైర్‌పర్సన్ సుప్రజారెడ్డికి వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. అనంతరం వారిని సత్కరించారు. నేతలు రమణరాజు, శ్రీనివాసులు, మురళీమోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కృష్ణయ్య పాల్గొన్నారు.

కల్యాణ మండప పునఃప్రారంభం

నెల్లూరు(బృందావనం): నవాబుపేటలోని మద్దులూరు వీరరాఘవయ్య నాయీ బ్రాహ్మణ కల్యాణ మండపాన్ని ఆధునీకరించి శుక్రవారం పునఃప్రారంభించామని నాయీ బ్రాహ్మణ ఎంప్లాయీస్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీగణపతి హోమం, శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీనివాస కల్యాణాన్ని నిర్వహించారు. నాయీబ్రాహ్మణ సంఘ రాష్ట్ర నేతలు రమణయ్య, మల్లాపురం కనకారావు, ఉడవల్లి శ్రీనివాసరావు, రాయవరపు రామకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు రంగారావు, కోశాధికారి ప్రభాకర్‌రావు, వెంకటేశ్వరరావు, బాలకోటయ్య, హజరత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు కృషి

నెల్లూరు (అర్బన్): ఇల్లు, ఇంటి పరిసరాల్లో దోమల నివారణకు కృషి చేయాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్ సూచించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది చేపట్టిన కార్యక్రమాలను కపాడిపాళెం, సంతపేట ప్రాంతాల్లో పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. దోమలతో ఫైలేరియా, మలేరియా, డెంగీ, చికున్ గున్యా, తదితర వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని తెలిపారు. ఇంటి ఆవరణలో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని సూచించారు.